**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 19.04.2026** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఉదయం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సమావేశమయ్యారు. విద్యారంగానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు.
2. రాష్ట్రంలో రైతుభరోసా పథకం రెండో విడత నిధులను రేపు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విడుదల చేస్తారు.
3. పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను ప్రతిపక్షాలు అడ్డుకోవడం చారిత్రక తప్పిదమని, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.
4. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విమానాశ్రయాలకు సంబంధించిన పనుల్లో వేగం పెంచాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్రాన్ని కోరారు.

..........................................................................

**రైతు భరోసా**

రాష్ట్రంలో రైతుభరోసా పథకం రెండో విడత నిధుల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమయ్యింది. రేపు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల సమక్షంలో నిధులను విడుదల చేస్తారు. యాసంగి సీజన్ పంట పెట్టుబడి రూపంలో గత నెల 23న సిద్దిపేట జిల్లా నర్మెటలో జరిగిన సభలో మొదటి విడతలో 68 లక్షల 89 వేల 955

మంది రైతులకు సుమారు 3వేల 447 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఆ విడతలో ఎకరం వరకు భూమి గల వారిని పరిగణనలోకి తీసుకొని ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున 57లక్షల 44వేల 907 ఎకరాలకు ప్రభుత్వం సాయం అందించింది. రెండో విడత నిధులను రేపు విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. మొదటి విడతలో రైతులకు ఎకరం వరకు సాయం అందగా.. రెండోవిడతలో రెండో ఎకరం వరకు సాయం అందిస్తారు. దీనికి అనుగుణంగా 45లక్షల 11వేల 947 మంది రైతులకు మొత్తం 36లక్షల 76వేల 766 ఎకరాల కోసం 2వేల 206 కోట్ల రూపాయలకు పైగా నిధుల విడుదలకు నిన్న ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది,

**......డెస్క్**

**కిషన్ రెడ్డి**

పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోవడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు.. వారి మిత్రపక్షాలు ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రక తప్పిదమని, మొత్తం ఏడుసార్లు మహిళా బిల్లును అదే పార్టీలు వ్యతిరేకించాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాలను గణనీయంగా పెంచే అవకాశాన్ని విపక్షాలు రాజకీయ స్వార్థంతో వదులుకున్నాయని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లు ద్వారా తెలంగాణలో 17 స్థానాలను 26కు, తమిళనాడులో 39 స్థానాలను 59కు పెంచాలని కేంద్రం సంకల్పించిందని, అయినా విపక్షాలు అడ్డుకున్నాయని ఆయన వివరించారు. దేశంలో 70 కోట్ల మంది మహిళలకు, 30 కోట్ల మంది దక్షిణాది ప్రజలకు జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

**........డెస్క్**

**విమానాశ్రయాలు**

వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విమానాశ్రయాలకు సంబంధించిన పనుల్లో వేగం పెంచాలని విమానయానశాఖకు చెందిన అధికారులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి

శ్రీనివాసరెడ్డి సూచించారు. సచివాలయంలో అధికారులతో నిన్న మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో రవాణా సౌకర్యాల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా నడిపించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యం అని అన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని అధికారులను కోరారు. వరంగల్ విమానాశ్రయానికి ఇప్పటికే 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించామని, ఆదిలాబాద్‌లో రక్షణ, పౌర విమానయానశాఖలు, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని మంత్రి వివరించారు.

**......డెస్క్**

**సెమినార్**

మానవ అక్రమ రవాణా, వెట్టి కార్మిక వ్యవస్థ నిర్మూలనపై తెలంగాణ రాష్ట్ర స్థాయి సెమినార్ నిన్న హైదరాబాద్‌లో జరిగింది. మహిళా భద్రతా విభాగం, అంతర్జాతీయ న్యాయ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సెమినార్ లో రెండు వందలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వెట్టిచాకిరి అనేది మానవ గౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసే ఒక క్లిష్టమైన సమస్య అని, దీని నిర్మూలనకు ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, ప్రజలందరి సమిష్టి కృషి అవసరం అని కార్యక్రమంలో పాల్గొన్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి అన్నారు. దోపిడీ రహిత సమాజాన్ని నిర్మించడంలో వివిధ శాఖలకు చెందిన వాళ్లందరూ పనిచేయాలని కోరారు. చట్టాలు ఉండటం కంటే వాటి సమర్థ అమలు ముఖ్యమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మానవ అక్రమ రవాణాకు గురయ్యే అవకాశాలను తగ్గించవచ్చని ఆమె అన్నారు.

**....డెస్క్**

**బదిలీలు**

తెలంగాణ పోలీస్ శాఖలో తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఆసిఫాబాద్ అడిషనల్

ఎస్పీగా చిత్తరంజన్, సంగారెడ్డికి చైతన్య రెడ్డి, జగిత్యాలకు పండరీ చేతన్ నియమితులయ్యారు. మెదక్ అదనపు ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్, నిజామాబాద్ అదనపు డీసీపీగా శుభం ప్రకాశ్, వనపర్తికి రాజేశ్ మీనా, ఆదిలాబాద్‌కు మౌనిక బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే భైంసా ఏఎస్పీగా సాయికిరణ్, ఉట్నూరు ఏఎస్పీగా రుత్విక్ సాయిని ప్రభుత్వం కేటాయించింది.

**పీటీసీ – హైదరాబాద్**

**గవర్నర్ ముఖ్యమంత్రి**

హైదరాబాద్ లోని లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలపై గవర్నర్ ముఖ్యమంత్రితో చర్చించారు. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణపత్రం తీసుకోవాలని కోరారు. గవర్నర్ సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

.....డెస్క్

**జూపల్లి కృష్ణారావు**

ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న చారిత్రక అడిక్‌మెట్ మెట్లబావిని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిన్న రాత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఒకప్పుడు చెత్తాచెదారంతో నిండి నిర్లక్ష్యానికి గురైన ఈ బావిని సాహె సంస్థ మూడేళ్ల కృషితో దాదాపు మూడు వేల టన్నుల చెత్తను తొలగించి పునరుద్ధరించింది. దొడ్ల డైరీ సంస్థ తన సామాజిక బాధ్యత కింద కోటి రూపాయల విరాళం అందజేసింది. రాష్ట్రంలోని 600 బావులలో ఇప్పటికే

30 బావులను పునరుద్ధరించామని, భవిష్యత్తులో స్టెప్ వెల్ సర్క్యూట్ టూరిజంను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. ఈ డిసెంబరులో రాష్ట్రంలోని 13 చారిత్రక ప్రాంతాల్లో నెల రోజుల పాటు బావిలీ ఆర్ట్ సంగమం పేరుతో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

**......డెస్క్**

**నారాయణన్**

వాతావరణం, వాయు కాలుష్యం, వాతావరణ పర్యవేక్షణ వంటి అంశాలను అధ్యయనం చేయడానికి రూపొందించిన జీ20 ఉపగ్రహాన్ని 2027లో ప్రయోగించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలిపారు. ఒకదానికొకటి ఢీకొనకుండా ఒకే రాకెట్‌ను ఉపయోగించి 100కు పైగా ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించిన తొలి దేశం భారతదేశమేనని ఆయన అన్నారు. నిన్న హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో డీఆర్‌డీఓ, ఇస్రో, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలను ఉద్దేశించి డాక్టర్ నారాయణన్ ప్రసంగించారు. జీ-20 దేశాల కోసం జీ-20 ఉపగ్రహ ప్రయోగంలో భారతదేశం ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి మనిషిని పంపేందుకు ఇస్రో కృషి చేస్తోందని డాక్టర్ నారాయణన్ తెలిపారు.

**.....ఎస్ఎస్డీ**

**ఎంఎంటీస్ ఫ్రీ**

హైదరాబాద్ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజారవాణాను ప్రోత్సహించేలా ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడానికి ప్రయత్నిస్తోంది. జూన్ 2 నుంచి ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, దక్షిణ మధ్య రైల్వే జీఎంకు లేఖ రాశారు. రైల్వేకు వచ్చే ఏడాదికి 10 కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వమే చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది. నిబంధనల ప్రకారం రైల్వే బోర్డు అనుమతి

లభిస్తే, నగరవాసులకు త్వరలోనే ఉచిత రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. దీనిపై అధికారులు ఇప్పటికే ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేస్తున్నారు.

**......పీటీసీ - హైదరాబాద్**

**రివ్యూ**

రాష్ట్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు నిన్న సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో సేవల నాణ్యత మెరుగుపరచడం, విద్యార్థుల భాగస్వామ్యం పెంచడం ఈ వారోత్సవాల ముఖ్య లక్ష్యమని ఆయన వివరించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ కార్యక్రమ వివరాలు తెలియజేశారు. ఈ వారోత్సవాల నివేదికలు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే, ప్రజాప్రతినిధులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు.

**డెస్క్**

**విద్యుత్ శాఖ**

కరీంనగర్ జిల్లాను విద్యుత్ ప్రమాద రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ సూపరిండేంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం 1017 వ్యవసాయ సర్వీసుల లక్ష్యం నిర్ణయించగా 1047 పూర్తి చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రతినిధితో ఎస్ఈ మాట్లాడుతూ...

**బైట్ - ఆర్ రవీందర్ - సూపరిండేంట్ అఫ్ ఇంజనీర్**

**పీటీసీ - కరీంనగర్**

**అగ్నిమాపకం**

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి యజ్ఞ నారాయణ తెలిపారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ....

**బైట్ : యజ్ఞ నారాయణ - అగ్నిమాపక శాఖాధికారి**

**..... పీటీసీ - వరంగల్**

**యాదాద్రి**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయంలో ఈ రోజు భక్తుల రద్దీ అధికంగా ఉంది. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్నారు. ఉచిత దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పడుతోంది.

**.........పీటీసీ - యాదాద్రి**

**కవ్వంపల్లి**

నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాధాన్యం తగ్గిస్తే ఊరు కోటోమని మానకొండూరు శాసనసభ్యులు, , టీపీసీసీ ఎస్సీసెల్ చైర్మన్, కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో నిన్న ఆయన మాట్లాడుతూ 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడం ప్రజాస్వామ్యానికి దక్కిన విజయమని అన్నారు. మహిళా బిల్లును విడిగా తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

**.......పీటీసీ - సిరిసిల్ల**

**ఆర్టీసీ**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో గేటు మీటింగ్ నిర్వహించారు. సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రధానమైన ఎనిమిది డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోకుంటే ఈ నెల 22 మొదటి షిఫ్ట్ నుండి కార్మికులు నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు.

**......పీటీసీ - ఆసిఫాబాద్**

**విజిలెన్స్ దాడులు**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు నిన్న ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులు, డాక్యుమెంట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. ఆస్తుల కొనుగోలు, అమ్మకాల లావాదేవీలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు కొనసాగించారు. విజిలెన్స్ సీఐ దశరథ ఆధ్వర్యంలో ఈ సోదాలు చేపట్టారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులను మూసివేసి వెళ్లిపోయారు.

**.......పీటీసీ - యాదాద్రి**